క్లుప్తంగా

దివ్యాంగులకు ఫిజియోథెరపీ సేవలు



ఫిజియోథెరపీ చేస్తున్న వైద్యుడు వీరేష్

సి.బెళగల్: స్థానిక భవిత కేంద్రంలో సోమవారం 10 మంది దివ్యాంగులకు ఫిజియోథెరపీ నిర్వహించినట్లు డాక్టర్ వీరేష్ తెలిపారు. క్యాంప్ నిర్వహణ సందర్భంగా వీరేష్ మాట్లాడుతూ.. మండలంలోని పలు గ్రామాల నుంచి వచ్చిన దివ్యాంగులకు బాల్, పాడ్స్ తదితర పరికరాలపై ముడుచుకుపోయిన కాళ్లకు, చేతులకు ప్రతి సోమవారం వ్యాయమం చేయించడం జరుగుతుందన్నారు. తాము సూచించిన వ్యాయామంను ఇంటి వద్ద చేయించడం ద్వారా దివ్యాంగులకు ఊరటగా ఉంటుందని, వైకల్య శాతం తగ్గి సొంతంగా పనులు చేసుకోవడానికి వీలు కలుగుతుందన్నారు. ప్రతివారం ఉచితంగా నిర్వహించే ఫిజియోథెరపీ శిబిరాన్ని మండల ప్రజలు, దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ సూచించారు. అదేవిధంగా ప్రత్యేక అవసరాలుగల చిన్నారులకు ఐఈఆర్టీ మద్దిలేటి ప్రత్యేక పరికరాలతో విద్యను బోధించారు. దివ్యాంగులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పరీక్షలను అవకాశాలుగా స్వీకరించాలి

ఓర్వకల్లు: మండలంలోని అన్ని ఉన్నత పాఠశాలల్లో 'పరీక్షా పే చర్చ'పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సోమవారం ఢిల్లీ నుంచి దేశ ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగాన్ని వీడియో కాన్ఫరెన్స్ విద్యార్థులు శ్రద్ధగా వీక్షించారు. ఈ సందర్భంగా ప్రధాని పరీక్షలకు సంబంధించి 21 అంశాలపై అవగాహన కల్పించారు. పదో తరగతి విద్యార్థులు పరీక్షలను భారమని భావించకుండా అవకాశంగా చూడాలన్నారు. పరీక్షలకు భయపడకుండా సవాల్‌గా స్వీకరించాలన్నారు. సమయాన్ని వృథా చేయకుండా, సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. ఎంఈఓ ఓంకార్‌యాదవ్, ఆయా పాఠశాలల హెచ్ఎంలు, సబ్జెక్టు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రామాల శుభ్రత అందరి బాధ్యత

ఓర్వకల్లు: గ్రామాల పరిశుభ్రత మనందరి బాధ్యతగా తీసుకోవాలని ఎంపీడీఓ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. అన్ని గ్రామ పంచాయతీల్లో ‘క్లాప్’ మిత్రులను నియమించుకోవాలన్నారు. వారి ద్వారా ఇంటింటికీ వెళ్లి చెత్తను సేకరించి తడి, పొడి చెత్తను వేరు చేయాలన్నారు. అసంపూర్తిగా ఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలకు వినియోగంలోకి తేవాలని, మరమ్మతులకు నిధులు అవసరమైతే ఇంజినీరింగ్ అధికారులతో అంచనాలు తయారు చేసి, జిల్లా కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపాలని సూచించారు. ఇంకుడు గుంతల తవ్వకాన్ని ప్రోత్సహించాలన్నారు. ఈఓఆర్‌డీ సుబ్బరాయుడు, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీర్ శ్రీనివాసులు, ఏపీఓ కుమార్‌సాయినాథ్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన

గడివేముల: మండల పరిధిలోని బిలకలగూడూరు, బూజునూరు గ్రామాల పరిధిలో జిందాల్ సిమెంట్ ఫ్యాక్టరీ వల్ల వచ్చే దుమ్ముతో దెబ్బతిన్న పంటలను సోమవారం తహసీల్దార్ వెంకటరమణ, ఏఓ హేమసుందర్‌రెడ్డి పరిశీలించారు. రెండు గ్రామాల పరిధిలో వివిధ పంటలు దుమ్ముతో దెబ్బతిన్నట్లు గుర్తించారు. 33 మంది రైతులకు సంబంధించి దాదాపు 50 ఎకరాల్లో పైర్లు దెబ్బతిన్నట్లు ప్రాథమిక అంచనాలు రూపొందించారు. దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం అందించేందుకు నివేదికలను జిల్లా ఉన్నతాధికారులకు అందజేస్తామని వారు తెలిపారు.

అడవులపై అవగాహన సదస్సు

గడివేముల: అడవులను అగ్ని బారి నుండి కాపాడటం, వన్యప్రాణులను రక్షించడంతో పలు అంశాలపై అటవీ శాఖ పాణ్యం అటవీ రేంజ్ అధికారులు అవగాహన కల్పించారు. సోమవారం మండల పరిధిలోని గడిగరేవుల జెడ్పీ పాఠశాలలో అటవీశాఖ ఆధ్వర్యంలో కళాజాత నిర్వహించారు. అనంతరం డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ విజయలక్ష్మి మాట్లాడుతూ అడవులలో చెట్లను నరకరాదన్నారు. చెట్ల పెంచడంతో పాటు అడవి జంతువులను కాపాడుకోవాలన్నారు. సర్పంచ్ రామ్మోహన్ రెడ్డి, ఉప సర్పంచ్ గోదాప్రసాద్, ఎంఈఓ-2 రాజేంద్రప్రసాద్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ అబ్దుల్ కలాం, జమాల్ వలి, ప్రొటెక్షన్ వాచర్స్ తదితరులు పాల్గొన్నారు

గుండె జబ్బులపై అప్రమత్తంగా ఉండాలి

కోడుమూరు రూరల్: గుండె సంబంధిత సమస్యల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోడుమూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ నాగరాజు సూచించారు. సోమవారం కోడుమూరు పీహెచ్‌సీలో గుండె సంబంధిత వ్యాధులు-తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ.. గుండె జబ్బుల నుంచి ప్రజల ప్రాణాలను కాపాడేందుకు ప్రభుత్వం రూ.45 వేలు విలువ చేసే ఇంజెక్షన్‌ను ఉచితంగా అందించేలా చర్యలు చేపట్టిందన్నారు. ఈ ఇంజెక్షన్ ద్వారా గుండె నొప్పితో ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారిని రక్షించవచ్చన్నారు. గుండెపోటుకు గురైన వారిని వెంటనే కోడుమూరు ఆస్పత్రికి చేరిస్తే ఇంజెక్షన్ వేసి తర్వాత మెరుగైన చికిత్స నిమిత్తం కర్నూలు ఆస్పత్రికి పంపుతామన్నారు. స్టెమీ జిల్లా నోడల్ ఆఫీసర్ కేదార్‌నాథ్‌గౌడ్, వైద్యులు శ్రీహరి, పెద్దయ్య, రంజిత్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

‘నులి’పేద్దాం

విద్యార్థుల ఆరోగ్యమే లక్ష్యంగా జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా సోమవారం వైద్య సిబ్బంది ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. వైద్యాధికారులు మాట్లాడుతూ.. నులిపురుగుల వల్ల రక్తహీనత, పోషకాల లోపం, ఆకలి మందగించడం, నీరసం, ఆందోళన, కడుపునొప్పి, వికారం, వాంతులు విరేచనాలు, బరువు తగ్గడం వంటి లక్షణాలతో పిల్లలు బాధపడుతుంటారని, ఆల్బెండజోల్ మాత్రలను మింగడం ద్వారా నులిపురుగులను నివారించవచ్చన్నారు. అలాగే వైద్య సిబ్బంది విద్యార్థులకు ఆరోగ్య అంశాలపై అవగాహన కల్పించి వ్యక్తిగత శుభ్రత పాటించాలని సూచించారు. – సాక్షి నెట్‌వర్క్



సి.బెళగల్: మాత్రను మింగిస్తున్న ఎంపీడీఓ రాణెమ్మ



పాణ్యం: ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్



కల్లూరు: విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న అధికారులు



కోడుమూరు రూరల్: మాత్రను మింగిస్తున్న ఎంపీడీఓ రాముడు

పీజీఆర్ఎస్ అర్జీలను పరిష్కరించండి



సి.బెళగల్‌లో అర్జీలను స్వీకరిస్తున్న ఇన్‌చార్జ్ తహసీల్దార్ పురుషోత్తం

సి.బెళగల్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు వచ్చే అర్జీలను పరిశీలించి, ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఇన్‌చార్జ్ తహసీల్దార్ పురుషోత్తం వీఆర్వోలను ఆదేశించారు. ఆయన సోమవారం తన కార్యాలయంలో మండల అధికారులతో కలిసి పీజీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించి, ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా పోలకల్, బురాన్‌దొడ్డి, సి.బెళగల్ గ్రామాలకు చెందిన పలువురు రైతులు తమ భూ సమస్యలను పరిష్కరించాలని అధికారులకు అర్జీలు ఇచ్చారు. అనంతరం ఆయన వీఆర్వోలతో మాట్లాడి, అర్జీల పరిష్కారాలపై సూచనలు చేశారు. ఏఓ మల్లేష్‌కుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మల్లేశ్వరి తదితరులు హాజరవగా, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ రాణెమ్మ ఏర్పాటు చేసిన పీజీఆర్ఎస్ కార్యక్రమానికి ఈఓఆర్డీ ఈశ్వరయ్యస్వామి, హౌసింగ్, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు సుమంత్, వెంకటప్రకాష్, గోనేనాయక్, ఎంఈఓ జ్యోతి హాజరయ్యారు. మరి కొంతమంది అధికారులు కార్యక్రమానికి ఎలాంటి అనుమతులు లేకుండా దుమ్మా కొట్టినట్లు ఆయా కార్యాలయ అధికారులు తెలిపారు.

ఎస్‌డబ్ల్యూపీసీలను వినియోగంలోకి తేవాలి



కొత్తకోటలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఈఓఆర్డీ సందీప్

సి.బెళగల్: మండలంలోని గ్రామాలలో నిర్మించిన చెత్త నుంచి సంపద తయారీ (ఎస్‌డబ్ల్యూపీసీ) కేంద్రాలను వినియోగంలోకి తేవాలని ఈఓఆర్డీ ఈశ్వరయ్యస్వామి పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ఆయన సోమవారం సి.బెళగల్ గ్రామ పంచాయతీలో నిర్మాణంలో ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాన్ని సర్పంచ్ పాండురంగన్న, అధికారులతో కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. మండలంలోని 18 గ్రామ పంచాయతీలకు గాను 12 గ్రామ పంచాయతీలలో ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాల నిర్మాణాలు పూర్తయ్యాయని, గ్రామాలలోని చెత్తను ఆయా కేంద్రాలకు తరలించి వర్మీ కంపోస్టు తయారు చేసి, గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. మరమ్మతులకు గురైన ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాలను వినియోగంలోకి తెచ్చేందుకు పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ ఆధ్వర్యంలో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని పీఆర్ ఏఈ వెంకటప్రకాష్‌కు సూచించారు. పంచాయతీ కార్యదర్శి సునీల్‌రాణి, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ సుప్రియ తదితరులు ఉన్నారు.

27న బుగ్గ రామేశ్వరుని కల్యాణం



ఆలయ ఈఓ చంద్రశేఖర్‌రెడ్డికి లఘ్న పత్రికను అందిస్తున్న అర్చకులు

ఓర్వకల్లు: మండలంలోని కన్నమడకల సమీపంలో వెలసిన బుగ్గ రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో మహాశివరాత్రి వేడుకల సందర్భంగా స్వామివారి కల్యాణం నిర్వహించేందుకు లఘ్న పత్రికను సోమవారం రూపొందించారు. ఆలయ ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి సమక్షంలో అర్చకులు చంద్రశేఖరశర్మ లఘ్న పత్రికను లిఖించి స్వామివారి పాదాల చెంత ఉంచి పూజలు చేశారు. అనంతరం ఆలయ ఈఓకు సమర్పించారు. మూడు రోజుల పాటు నిర్వహించే వేడుకల వివరాలను ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి వెల్లడించారు. ఇందులో భాగంగా ఈ నెల 25న సాయంత్రం కన్నమడకల నుంచి ఉత్సవమూర్తులు బుగ్గ క్షేత్రానికి వరప్రయాణం చేస్తారు. 26న ఉదయం స్వాముల వారికి అభిషేకాది పూజలు, రాత్రి జాగరణ సందర్భంగా కొచ్చెరువుపల్లె వారిచే శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి జీవిత చరిత్ర పౌరాణిక నాటక ప్రదర్శన, 27న స్వామివారి కల్యాణోత్సవం, మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. సాయంత్రం ఉత్సవమూర్తులు గ్రామానికి తిరుగు ప్రయాణం చేస్తారని తెలిపారు. గ్రామ పెద్దలు సుధాకరరావు, బొల్లారం వెంకటేశ్వర్లు, మక్కలి ఎల్లనాగన్న, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

వసతి గృహ నిర్మాణానికి భూమి పూజ



వసతి గృహ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

కల్లూరు: కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో విద్యారంగానికి పెద్దపీట వేస్తుందని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. సోమవారం పర్ల గ్రామంలో నూతన బాలుర వసతి గృహ నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వసతి గృహ నిర్మాణం సకాలంలో పూర్తి చేయాలని అధికారులను, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. అనంతరం గ్రామీణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉద్యోగుల హాజరు, రికార్డులను, రిపోర్టులను పరిశీలించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు. సర్పంచ్ హనుమక్క, ఈఈ మద్దన్న, డీఈ నాగిరెడ్డి, తదితరులు ఉన్నారు.

ఎల్లమ్మకు పల్లకీ సేవ



ఉత్సవమూర్తిగా ఎల్లమ్మ దేవి



వెంకాయపల్లెలో అమ్మవారి పల్లకీ ఊరేగింపు

కర్నూలు(రూరల్): వెంకాయపల్లె గ్రామ సమీపాన వెలసిన ఎల్లమ్మకు బార్తాల పౌర్ణమి (అమ్మవారి జయంతి) ఉత్సవాల ప్రారంభం సందర్భంగా సోమవారం పల్లకీ సేవ కార్యక్రమాన్ని ఈఓ పి.యస్.రాధాక్రిష్ణ, అశేష సంఖ్యలో హాజరైన భక్తుల సమక్షంలో వైభవంగా నిర్వహించారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి పల్లకీలో ఉంచి ఆలయ ప్రాంగణం నుంచి వెంకాయ పల్లె గ్రామానికి మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకెళ్లారు. గ్రామంలోని మహిళలు, భక్తులు అమ్మవారికి పసుపు, కుంకుమ, టెంకాయలు, నిమ్మకాయలదండ సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

భోగేశ్వరుడి సన్నిధిలో ఏఎస్పీ

గడివేముల: మండల పరిధిలోని దుర్గా భోగేశ్వర స్వామి సన్నిధిలో నంద్యాల జిల్లా అడిషనల్ ఎస్పీ యుగంధర్ సోమవారం పూజలు నిర్వహించారు. ఆయన కుటుంబ సభ్యులతో కలిసి భోగేశ్వరుడి దర్శనార్థం వచ్చారు. స్వామివార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. స్థానిక మండపంలో వారికి ప్రసాదాలు అందించి వేదాశీర్వచనం చేశారు.

నేడు ‘పొలం పిలుస్తోంది’ కార్యక్రమం

సి.బెళగల్: మండల పరిధిలోని రెండు గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయ అధికారి (ఏఓ) మల్లేష్‌కుమార్ తెలిపారు. ఆయన సోమవారం ఓ ప్రకటనలో తెలుపుతూ.. ఈ వారం కార్యక్రమ నిర్వహణలో భాగంగా మంగళవారం ఉదయం సి.బెళగల్ రైతు సేవా కేంద్రం – 2లో, మధ్యాహ్నం చింతమానుపల్లె గ్రామ సచివాలయంలో ‘పొలం పిలుస్తోంది’ కార్యక్రమం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అలాగే మధ్యాహ్నం క్షేత్ర ప్రదర్శనలో భాగంగా రైతులతో కలిసి పంట పొలాల సందర్శించనున్నట్లు చెప్పారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

సి.బెళగల్: పదో తరగతి విద్యార్థులందరూ ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈఓ జ్యోతి ఆదేశించారు. ఆమె సోమవారం సి.బెళగల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో.. ప్రధాని నరేంద్ర మోదీ ఆన్‌లైన్‌లో నిర్వహించిన పరీక్షపే చర్చ కార్యక్రమానికి హాజరయ్యారు. కార్యక్రమం అనంతరం పదో తరగతి విద్యార్థులు, ఉపాధ్యాయులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఎంఈఓ మాట్లాడుతూ.. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని చదవాలని, టీచర్లు విద్యార్థులను పరీక్షలకు సంసిద్ధులను చేయాలని సూచించారు. అనంతరం పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు నిర్వహించిన ప్రీఫైనల్ పరీక్షలను పరిశీలించారు. అదేవిధంగా మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. హెచ్ఎం అజీమ్‌బాషా, ఉపాధ్యాయులు ఉన్నారు.

ప్రిన్సిపాల్, వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలి

గడివేముల: స్థానిక ఏపీ మోడల్ స్కూల్ హాస్టల్ గత కొద్ది రోజుల కిందట ఉడకని చికెన్‌తో పాటు భోజనం తిని విద్యార్థులు అనారోగ్యానికి గురయ్యారని, ఇందుకు కారణమైన ప్రిన్సిపాల్, వార్డెన్‌ను సస్పెండ్ చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక మోడల్ స్కూల్ హాస్టల్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ.. విధుల పట్ల నిర్లక్ష్యంతో వ్యవహరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా అధికారులు స్పందించి హాస్టల్‌లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన భోజనం అదించాలన్నారు. రాయలసీమ విద్యార్థి ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవీంద్రనాథ్, డీబీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు డీసీ. నాగన్న, ఏపీఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సురేంద్ర పాల్గొన్నారు.

అందరి సహకారంతో గ్రామాభివృద్ధి



మాట్లాడుతున్న సర్పంచ్ మేకల పల్లవి

పాణ్యం: పంచాయతీ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఆరోపణలు చేయడం తగదని సర్పంచ్ మేకల పల్లవి అన్నారు. సోమవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో అధికారులపై సభ్యులు ఆరోపణలు చేయడంపై సాయంత్రం విలేకరుల సమావేశం నిర్వహించారు. సర్పంచ్ మాట్లాడుతూ అందరి సహకారంతో పాణ్యంలో రూ.2.50 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు చెప్పారు. ఈ అభివృద్ధిలో వార్డు సభ్యులు, అధికారుల కృషి ఎంతో ఉందన్నారు. ఈ క్రమంలో ఆరోపణలు చేయడం తగదని, ఉన్నతాధికారుల సమక్షంలో సందేహాలను నివృత్తి చేసుకోవచ్చన్నారు. పంచాయతీలో చేపట్టిన ప్రతి పనికి, చెల్లించే సొమ్ముకు తప్పకుండా బిల్లులు, రసీదు ఉంటాయని స్పష్టం చేశారు. అధికారులు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయవచ్చన్నారు.

ఈఓఆర్డీ అక్రమాలను నిగ్గుతేల్చాలి

- రూ.15 లక్షలు స్వాహా చేశారంటూ సభ్యుల ఆరోపణ
- చేయని పనులకు బిల్లులు, సర్పంచ్‌లకు బెదిరింపులు, తీర్మానాలకు వసూళ్ల పర్వం
- డీపీఓకు ఫిర్యాదు చేశాం, త్వరలో కోర్టుకు వెళ్తామంటున్న సభ్యులు



మాట్లాడుతున్న ఉప సర్పంచ్ పాలం చంద్రశేఖర్‌రెడ్డి, వార్డు సభ్యులు

పాణ్యం: మండలానికి ఇటీవల ఈఓఆర్డీగా వచ్చిన చంద్రమౌళీశ్వర్‌గౌడ్ అన్ని పంచాయతీలను నాశనం చేస్తున్నారని, ప్రతి సంతకానికి ఓ రేటు ఫిక్స్ చేసి సర్పంచ్‌లను బెదిరించి, తీర్మానాలకు భారీగా డబ్బులు వసూలు చేస్తున్నారని గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ పాలం చంద్రశేఖర్‌రెడ్డి, వార్డు సభ్యులు మండిపడ్డారు. సోమవారం సర్పంచ్ మేకల పల్లవి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. వాడీవేడిగా సాగిన ఈ సమావేశంలో.. అధికారుల తీరుపై సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. వార్డుల్లో ఫలానా పని చేయాలని కోరినా పట్టించుకోవడం లేదన్నారు. పంచాయతీలో చేయని పనులకు బిల్లులు చెల్లించారని, కొత్తగా వచ్చిన ఈఓఆర్డీ ఆధ్వర్యంలో గ్రామ కార్యదర్శి ఆనందరావు బిల్లులు చేశారని ఆరోపించారు. పారిశుద్ధ్య కార్మికులు పనికి రాకున్నా హాజరు వేసి వేతనాలు కాజేశారని మండిపడ్డారు. ఈ అక్రమాలన్నింటికీ డిజిటల్, కంప్యూటర్ బిల్లులు లేవన్నారు. ఇంటి పన్నుల బుక్‌లు కూడా ఒరిజినల్, డుప్లికేట్ ఉన్నాయన్నారు. ప్రతి సమావేశం తర్వాత రిజిస్టర్‌లో ఖాళీగా ఉంచి తమకు అనుకూలంగా దొంగ బిల్లులు పెట్టుకుంటున్నారన్నారు. ఈఓఆర్డీ వచ్చినప్పటి నుంచి రూ.12 లక్షల వరకు స్వాహా చేశారని, సర్పంచ్‌లను బెదిరించి ప్రతి పనికి 2 శాతం కమీషన్ వసూలు చేస్తున్నారని ఆరోపించారు. పాణ్యం, గోనవరం, భూపనపాడు, కొణిదేడు గ్రామాల్లో లక్షల రూపాయలు వసూలు చేశారని మండిపడ్డారు. అక్రమాలపై ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. సదరు ఈఓఆర్డీ గతంలో పనిచేసిన చోట మహిళా ఉద్యోగుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించారని, ఇక్కడ కూడా ఇలాగే ప్రవర్తిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామ సర్పంచ్‌లను భయపెట్టి తీర్మానాలు చేయించి సంతకాలు చేసేందుకు రూ. 5-10 వేలు వసూలు చేస్తున్నారని, తన నుంచి రూ.40 వేలు ఫోన్‌పే చేయించుకున్నట్లు తెలిపారు. ఈ విషయంపై ఈఓఆర్డీ చంద్రమౌళీశ్వర్ గౌడ్‌ను వివరణ కోరగా.. చేసిన ప్రతి పనికి వివరాలను రికార్డుల్లో నమోదు చేశామని, విచారణ చేసుకోవచ్చన్నారు. తీర్మానాలకు డబ్బు వసూలు చేయడం లేదన్నారు. ఈఓ ఆనందరావు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో ఆరోగ్యం



ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను ప్రదర్శిస్తున్న సిబ్బంది

ఓర్వకల్లు: ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన ఆహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారని ఆ విభాగం సిబ్బంది వెంకటరమణ, ఖాసీం అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను ప్రదర్శించారు. వారు మాట్లాడుతూ.. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలనే లక్ష్యంతోనే రైతులు పండించిన ఉత్పత్తులను వినియోగదారులకు అందుబాటులో ఉంచేందుకు ప్రతి సోమవారం ప్రత్యేక స్టాల్స్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వివిధ గ్రామాల నుంచి రైతులు పండించిన పలు రకాల ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, తదితర ఉత్పత్తులను ప్రదర్శించారు. కార్యాలయ పని మీద వచ్చిన ప్రజలు వాటిని కొనుగోలు చేశారు. ఎంపీడీఓ శ్రీనివాసులు, కార్యాలయ సిబ్బంది, యూనిట్ ఇన్‌చార్జ్‌లు శ్రీకాంత్, జుబేర్, శివ, లక్ష్మీనారాయణ, లావణ్య, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాలి



రిలే నిరాహార దీక్ష చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

పాణ్యం: మండలంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ స్థానిక ప్రజా సంఘాల నాయకులు సోమవారం పాణ్యం బస్టాండ్‌లో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. వారు మాట్లాడుతూ.. ఆర్టీసీ బస్టాండ్‌లో టాయ్‌లెట్స్ లేక ప్రయాణికులు అవస్థలు పడుతున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలకు ప్రహరీ నిర్మించాలని, ఏపీ మోడల్ స్కూల్, కస్తుర్బా గాంధీ పాఠశాలకు రోడ్డు వేయాలని, ఇంటర్ నుంచి పీజీ చదివే విద్యార్థులకు వసతి గృహాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే బస్టాండ్ నుంచి గ్రామం వరకు రోడ్డును విస్తరించాలని, నిరుపేదలకు మూడు సెంట్ల స్థలం మంజూరుచేసి, పక్కా గృహాలు నిర్మించాలన్నారు. పాణికేశ్వర స్వామి ఆలయానికి రోడ్డు వేసి టూరిజంను ఏర్పాటు, తమ్మరాజుపల్లె, బలపనూరు, సుగాలిమెట్ట గ్రామాల విద్యార్థులకు హైవేపై రోడ్డు దాటేందుకు వీలుగా వంతెనలను నిర్మించాలన్నారు. పాణ్యంలో ఐటీఐ, పాలిటెక్నిక్ కళాశాలను ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ పాఠశాలలో మినరల్ వాటర్ ప్లాంటును ఏర్పాటు చేయాలని కోరారు. ప్రజా సంఘాల నాయకులు, వివిధ పార్టీల నాయకులు శివకృష్ణయాదవ్, అరుణ్‌కుమార్, వనం వెంకట్రాది, ధోని రాజుయాదవ్, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీనివాస కల్యాణం



అలంకరణలో శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామివారు

పాణ్యం: స్థానిక ఎస్సార్బీసీ కాలనీలో వెలసిన వేంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం స్వామివారి కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. ఆలయ 23వ వార్షికోత్సవం సందర్భంగా ఈ వేడుకలు జరిపారు. ఉదయం నుంచి వేదపండితులు స్వామి వారికి ఏకాంత సేవతో మొదలుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం 9 గంటల నుంచి కల్యాణ తంతును ప్రారంభించారు. వేదపండితుల మంత్రోచ్చరణ మధ్య శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. భక్తులు కనులారా వీక్షించి తరించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఎస్సార్బీసీ అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా నందీశ్వర విగ్రహ ప్రతిష్ట



నందీశ్వరుడికి పూజలు చేస్తున్న భక్తులు

కోడుమూరు రూరల్: కోడుమూరులోని మునిమందలో ఉన్న పురాతన నందీశ్వర స్వామి ఆలయ పునర్ నిర్మాణంలో భాగంగా సోమవారం విగ్రహ ప్రతిష్ఠోత్సవాలను ఘనంగా నిర్వహించారు. పట్టణానికి చెందిన భారతి సిమెంట్ జిల్లా డిస్ట్రిబ్యూటర్ ఎద్దుల మహేశ్వరరెడ్డి సొంతంగా రూ.13.50 లక్షలు వెచ్చించి ఆలయాన్ని పునర్ నిర్మించారు. విగ్రహ ప్రతిష్ఠోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం యంత్ర ప్రతిష్ట, మూల విరాట్ విగ్రహ ప్రాణ ప్రతిష్ట కార్యక్రమాలను వేదపండితులు, ఆలయ కమిటీ సభ్యులు, వీరశైవ లింగాయతులు వైభవంగా నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో వందలాది ప్రజలు పాల్గొని స్వామి వారి తీర్థప్రసాదాలను స్వీకరించారు. గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ హాస్టల్ తనిఖీ

సాక్షి ఎఫెక్ట్



గడివేముల మోడల్ స్కూల్ హాస్టల్‌లో భోజనాన్ని పరిశీలిస్తున్న త్రిసభ్య కమిటీ సభ్యులు

గడివేముల: మండల కేంద్రంలోని ఏపీ మోడల్ స్కూల్ హాస్టల్‌లో అపరిశుభ్రత నెలకొందని, విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడం లేదని సోమవారం 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన 'ఇలా ఉంటే రోగాలు రావా?' కథనానికి మండలస్థాయి అధికారులు స్పందించారు. మోడల్ స్కూల్ హాస్టల్‌ను త్రిసభ్య కమిటీ సభ్యులు తహసీల్దార్ వెంకటరమణ, ఎంపీడీఓ వాసుదేవగుప్తా, ఎంఈఓ మేరీ సునీత తనిఖీ చేశారు. హాస్టల్‌లో విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించి వార్డెన్‌కు పలు సూచనలు చేశారు. మంచి నీటి ట్యాంకును పరిశీలించి వెంటనే శుభ్రం చేయించాలని ఆదేశించారు. హాస్టల్‌లో ఉన్న ఇబ్బందులను, విద్యార్థినులకు అందుతున్న భోజనంపై నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు అందజేస్తామని వారు తెలిపారు.